# జనపదం
JANAPADHAM

హైదరాబాద్ | బుధవారం 11 సెప్టెంబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 93

తెలుగు దినపత్రిక




## దటీజ్ కాంగ్రెస్..?!
# హస్తినలో హైడ్రామా..
### ఖర్గే ముందుకు పంచాయితీ

- మధ్యవర్తిగా కన్నడ నేత..
- కూల్చివేతలపై ఏఐసీసీ చీఫ్ కు ఫిర్యాదులు
- ఢిల్లీలో ఓ మంత్రి, పలువురు ఎమ్మెల్యేలు
- ఎట్టకేలకు భరోసా ఇచ్చిన ఖర్గే
- ప్రస్తుతానికి బడా నేతల నిర్మాణాలు పదిలమే
- జిల్లాల్లో విస్తరణకు సైతం బ్రేక్

2

దటీజ్ కాంగ్రెస్. ఊ.. అంటే ఫ్లయిట్ ఎక్కడం, ఢిల్లీలో వాలడం. ఇక్కడ వినకపోతే అక్కడే తేల్చుకోవడం. పాపం...... సీఎంకు ఇప్పుడిప్పుడే కొంచెం తెలిసొస్తున్నట్టుగా అనిపిస్తున్నది. వద్దయ్యా... వాళ్లు ఒప్పుకోరయ్యా.., అట్లా కూలగొట్టుకుంటూ పోతే మీ వోల్లయ్యే సవాలక్ష ఉంటాయయ్యా.. అని చెబితే వింటేనా.? ఏదో చేయాలని కంకణం కట్టుకుని, ఆరంభంలో అదరగొట్టుకుంటూ పోతే, ఇక ఈయన వినేట్లు లేడని వాళ్లంతా హస్తినాలో పెట్టేకాడనే పంచాయితీ పెట్టి ఏమీ ఎరగనట్టుగా కూర్చునే. మీకు అక్కడ నుంచి వర్తమానం రాగానే సడెన్ గా సెట్ బ్యాక్ అయితే పరువేమి కాను అన్నట్టుగా ఏదేదో ముచ్చట్లతో హైడ్రాను తుస్.. అనిపిస్తున్న విషయం స్పష్టంగా కనిపించవట్టే. మీరు హైడ్రా అని భ్రమపడితే., మీ వాళ్లు దేశరాజధానిలో హైడ్రామా నడిపి చేయాల్సింది చేసే.

## హై(యో్యా)డ్రా... తడబడుతున్న కమిషన్..

రాజకీయ ఒత్తిళ్లే కారణమా..? | ఆరంభశూరత్వంగా కూల్చివేతలు


నో ఎఫ్ టీఎల్.., నో బఫర్ జోన్.. | కేవలం నాలాలపైనే ఫోకస్

2



### అయినా.. బుద్ధి మారడం లేదు..

వ్యక్తులపై అభిప్రాయ భేదాలుంటే ఉండొచ్చుగానీ, వ్యవస్థను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఎవరికి నచ్చినట్టు వాళ్లు చేయడానికి లేదిక్కడ. రాజ్యాంగం కల్పించిన వెసులుబాటు, పెద్దలు చూపిన మార్గంలోనే కాంగ్రెస్ పార్టీ కూడా వెళ్తున్నది. పీఏసీ చైర్మన్ పై బీఆర్ఎస్ అనవసరపు రాద్ధాంతం చేస్తున్నది. మొన్నటి ఎన్నికల్లో ప్రజలు ఓటమితో చావగొట్టినా వాళ్ల బుద్ధి మారడం లేదు. నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేను మొర్రో.. అని స్వయంగా అరికెపుడి గాంధీయే చెబుతుంటే వాళ్లకు ఎందుకు ఎక్కడం లేదో. వాళ్లకు వాళ్లకు ఉంటే వాళ్లే చూసుకోవాలిగానీ, శాసనసభ వ్యవహారాలతో ఆటలాడొద్దు. అసలు బీఆర్ఎస్ అంటేనే కేటీఆర్, హరీష్ రావు మాత్రమే. ఇప్పటి వరకు వాళ్లిద్దరు మాట్లాడిందే తప్ప మిగతా వారు ఉన్నట్టా.. లేనట్టా.. తెలియని అనిశ్చితి. స్పీకర్ రాజ్యాంగ విలువల మేరకు చైర్మన్ నియామకం చేశారు. - శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



# మరీ అంత వీపీలమా..!?

## చెవిలో పువ్వులు.. రోత పుట్టించే కథలు..
## కండువాలు.. కొత్త స్టోరీలు..

### పది మంది పార్టీ మారలేదట..
### స్పీకర్‌కు ఇదే సమాధానం

### దేవుడి కండువాలే: అరికపూడి గాంధీ
### బీఆర్ఎస్ కే పీఏసీ చైర్మన్ ఇచ్చాం: శ్రీధర్ బాబు
### ప్రతిపక్షం ఇవ్వకుండా ఇదేం పోకడ : వేముల ప్రశాంత్ రెడ్డి
### నిర్ణయం కరెక్ట్ కాదు: మహేశ్వర్ రెడ్డి

జనపదం, బ్యూరో

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ కార్యాలయాన్ని తప్పు పడుతూ అలా తీర్పు వెలువడిందో లేదో, కాంగ్రెస్ ప్రభుత్వం వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. పీఏసీ చైర్మన్ అరికెపుడి గాంధీకి కట్టబెడుతూ జారీ చేసిన బులిటిన్ బీఆర్ఎస్ కు షాక్ ఇచ్చింది. నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష.... అన్నట్టు కేసీఆర్ కు, బీఆర్ఎస్ కు దిమ్మదిరిగే సమాధానం ఇచ్చింది కూడా. రాజకీయాలు చేయడం మాకూ వచ్చనే సంకేతాని స్తూనే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని, కప్పుకున్నవి కాంగ్రెస్ కండువాలు కాదని అవి దేవుడి కండువాలని చెప్పించే ప్రయత్నం చేస్తోంది. స్పీకర్ పరిధిలోకి న్యాయవ్యవస్థ వేలుపెట్టకూడదని ......(తరువాయి 2లో)

అర్.ర్..ర్...ర్....ర్రె.... ఇవి ఆ కండువాలా.., మేమే మరేవో అనుకున్నాం. ఓహో... మీరు చెప్పుతున్నారుగా ఇవి అవి కాదని.., అయితే ఇవి అవే అయినా కాదని నమ్మాల్సిందే. ఎందుకంటే మీరు చెప్పారు., ఆ మాటకొస్తే మీరేది చెబితే అదే. నమ్మడం మాకు తప్పదు., నిండా ముంచడం మీ వంతు. అంతేకదా.., ప్రతిసారి నమ్మకంగా మోసం చేస్తారని తెలిసినా.., పిచ్చిగా నమ్మకపోతే మీ ఆటలెలా సాగుతున్నాయి. మేం పదేపదే నమ్ముతాం.., మీరు అదే పనిగా ముంచుతూనే ఉండండి. మొన్నటికి మొన్న అదో పార్టీ మీద అభిమానంతో గెలిపించుకుంటే, మీరు నమ్మకానికి పంగనామాలు పెట్టి., మేం ద్వేషించిన పార్టీ కండువాతో కనిపిస్తిరి. ఇంతకన్నా నమ్మక ద్రోహం ఇంకోటుంటదా..? ఆ వేళ మీరు అటు పార్టీలోనే ఉంటే మా నిర్ణయం ఎలా ఉండేదో కదా. ఎంతైనా మీకు మేం మరీ......... అంత......... అదిగా కనిపిస్తున్నామని, ఐదేండ్లు ఏమీ చేయలేమనే కదా మీ ఆటలు.... కానివ్వండి. మీరు కప్పుకున్నవి దేవుడి కండువాలంటారో., మరే గుడ్డలని చెబుతారో చెప్పండి... మేం వింటూనే ఉంటాం.

### ప్రతిపక్షానికే ఇవ్వాలని ఉందా..

గ్రౌండ్ చాలా క్లారిటీగా ఉంది. ఎన్నికలొస్తే గెలుపు నాదే. నేను కాంగ్రెస్ పార్టీలో చేరలేదు., సీఎం నా మిత్రుడు. ఆయనను కలవడం తప్పా., నియోజకవర్గ అభివృద్ధి కోసం వారితో కలిసి సాగడం నేరమా..? ఎంత సేపు వక్రంగానే ఆలోచిస్తున్నారుగానీ, నిజాలు తెలుసుకోవడం లేదు. ఆ రోజు నేను కప్పుకున్నది దేవుడి కండువా. అంతేగానీ నేను ఏ పార్టీలోకి వెళ్లలేదు. నేను రూల్ ప్రకారమే పీఏసీ చైర్మన్ కు నామినేషన్ వేశాను. కావాలంటే స్పీకర్ ను కలిసి తెలుసుకోవచ్చు. మనం చేస్తే ఒప్పు, ఇతరులు చేస్తా తప్పు అన్నట్టుగా ఆలోచించడం ఫూలీష్ నెస్. అయినా ప్రతిపక్షానికే పీఏసీ ఇవ్వాలనే రూల్ ఏమైనా ఉందా..? నాకు పదవి ఇస్తే జీర్ణించుకోలేక రాద్ధాంతం చేస్తున్నారు.

- అరికెపూడి గాంధీ, ఎమ్మెల్యే



### ఏ లెక్కన ఇచ్చినట్టు..

ప్రజాస్వామ్యం ఖూనీ జరిగింది. పీఏసీ చైర్మన్ సంప్రదాయానికి కాంగ్రెస్ పాడె కట్టింది. ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వకుండా తప్పులను కప్పిపుచ్చుకునే తెర తీసింది. అరెకపుడి గాంధీకి చైర్మన్ ఏ లెక్క ప్రకారం ఇచ్చారో వాళ్లే చెప్పాలి. అసెంబ్లీ రూల్ బుక్ 250 నిబంధన ప్రకారం బీఆర్ఎస్ పార్టీకి ఉన్న 38 మంది ఎమ్మెల్యేల్లో ముగ్గురికి పీఏసీలో అవకాశం వస్తుంది. గాంధీ నామినేషన్ వేస్తే 13 మంది కంటే ఎక్కువ నామినేషన్ వేసినట్లు అవుతుంది. 13 మంది ఎమ్మెల్యేల కంటే ఒక్కరు ఎక్కువగా నామినేషన్ వేసినా ఎన్నిక జరగాలి. మరి హరీష్ రావు వేసిన నామినేషన్ ఎటు పోయినట్టు..,? అరికెపూడి గాంధీ ఎన్నికకు 13 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎవరు సపోర్టు చేసినట్టు..?

- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



## పట్టణాభివృద్ధి భేష్..

- తెలంగాణకు అదనపు రుణాలపై పరిశీలిస్తాం..
- సెస్, సర్ ఛార్జీల్లోనూ వాటా కోరింది..
- ప్రోత్సాహం ఇవ్వాలనే అంశంపై తర్వాత సిఫారసు చేస్తాం..
- 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగఢియా

3




## ఔర్... చార్...

- రాష్ట్రానికి మరో నాలుగు మెడికల్ కాలేజీలు..
- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కేంద్రం..
- ఈ ఏడాది 8 కాలేజీలు సాధించిన రాష్ట్ర సర్కార్
- ఒక్కో కాలేజీలో 50 సీట్లు..
- అందుబాటులోకి 400 ఎంబీబీఎస్ సీట్లు
- కేంద్రం, సీఎంకు మంత్రి దామోదర కృతజ్ఞతలు

3



## సాగర్‌లో ఓకే..

- వినాయక నిమజ్జనానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్..
- హైడ్రాను ప్రతివాదిగా చేయలేమన్న ధర్మాసనం
- చివరి సమయంలో ధిక్కరణ పిటీషన్ సరికాదంటూ వ్యాఖ్య..
- నో ఇమ్మర్షన్ అంటూ పోలీసుల బోర్డులు..?

3




## ఫిఫ్టీ పర్సెంట్ ఇవ్వండి..

- తెలంగాణ ఫ్యూచర్ స్టేట్
- బలమైన పునాదులున్నా ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటున్నాం
- గత సర్కార్ నిర్వాకంతో రూ.6.85 లక్షల కోట్ల రుణభారం
- సమస్య పరిష్కారానికి సాయం ఇవ్వాలి
- తెలంగాణను ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం

3

### కేంద్ర పన్నుల్లో నిధుల వాటా 50 శాతానికి పెంచాలి
### 16వ ఆర్థిక సంఘం సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



## చాకలి ఐలమ్మ యూనివర్సిటీ..

- కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి నామకరణం..
- మహిళా కమిషన్ సభ్యురాలిగా ఐలమ్మ మనుమరాలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఘనంగా ఐలమ్మ వర్ధంతి సభ
- ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగిస్తామని ప్రకటన..

3

## నీ గాలి తీసేది ఆ‘ట్యూబు’లే..

- యూట్యూబ్ లపై సీఎం వ్యాఖ్యలు అర్థరహితం..
- మాజీ మంత్రి హరీష్ రావు..
- ఛానెళ్లను తక్కువ చేసి మాట్లాడడంపై ఫైర్..

2

## పనులకు అనుమతివ్వండి..



- డీపీఆర్ లు సిద్ధమయ్యాయి..
- కరీంనగర్ - హసన్ పర్తి కొత్త రైల్వే లైన్ ఎంతో అవసరం..
- ఉప్పల్ రైల్వే స్టేషన్ ను అప్ గ్రేడ్ చేయండి
- జమ్మికుంటలో దక్షిణ్ ఆగేలా చూడండి..
- మంత్రికి బండి సంజయ్ కుమార్ వినతి..

3



3

### లక్ష్మారెడ్డికి సతీ వియోగం..
#### హరీష్ రావు, పలువురు ప్రముఖుల నివాళి..

మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతా లక్ష్మారెడ్డి అకాల మరణవార్త తెలుసుకుని మాజీ మంత్రి హరీష్ రావు పరామర్శించారు. నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామానికి చేరుకుని శ్వేత లక్ష్మారెడ్డి భౌతిక కాయానికి నివాళి అర్పించి లక్ష్మారెడ్డిని ఓదార్చారు. ఆమె ఆత్మకు శాంతికలగాలని భగవంతున్ని ప్రార్థించారు.

# దటీజ్ కాంగ్రెస్..?!

## హస్తినలో 'హైడ్రా'మా..

- ఖర్గే ముందుకు పంచాయితీ
- మధ్యవర్తిగా కన్నడ నేత..
- కూల్చివేతలపై ఏఐసీసీ చీఫ్‌కు ఫిర్యాదులు
- ఢిల్లీలో ఓ మంత్రి, పలువురు ఎమ్మెల్యేలు
- భరోసా ఇచ్చిన ఖర్గే
- ప్రస్తుతానికి బడా నేతల నిర్మాణాలు పదిలమే
- జిల్లాల్లో విస్తరణకు బ్రేక్



**జనపదం, ఢిల్లీ:** హైడ్రా పంచాయితీ హస్తినకు చేరింది. ఎంత చెప్పినా సీఎం రేవంత్‌రెడ్డి వినకపోవడంతో ఖర్గే దగ్గర సొంత పార్టీ నేతలే పంచాయితీ పెట్టారు. చెరువుల ఆక్రమణల పేరుతో నిర్మాణాలను కూల్చితే పార్టీ ఫండ్కు ఎసరు వస్తుందని ఏకరు పెట్టారు. రెండు రోజుల పాటు రాష్ట్రానికి చెందిన కీలక నేతలు, ఓ మంత్రి, పలువురు ఎమ్మెల్యేలు హైడ్రా విషయంలోనే ఢిల్లీలో మకాం వేశారు. వీరికి కర్ణాటకకు చెందిన ఓ ముఖ్యనేత రాయబారిగా వ్యవహరించినట్లు పార్టీ వర్గాల్లో టాక్. ఈ నేపథ్యంలోనే హైడ్రా ఒక్కసారిగా రూట్మార్చింది. రాత్రికి రాత్రే ఏఐసీసీ నుంచి ఆదేశాలు రావడంతో సీఎం సైతం తీరు మార్చుకున్నట్లు ప్రచారం జరుగుతున్నది. దీంతో ఎట్టకేలకు హైడ్రా దూకుడుకు బ్రేక్ పడింది.

### ప్రస్తుతానికి స్లో..

రాజకీయ, వ్యాపార, సినీరంగ ప్రముఖుల నిర్మాణాలను హైడ్రా టార్గెట్ చేసింది. ఇటు జన్వాడ ఫాంహౌస్తో పాటుగా ఓ మంత్రి, మరో ఎమ్మెల్యేకు సంబంధించిన నిర్మాణాలకు సైతం నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో హైడ్రా అంటే వణుకు మొదలైంది. అయితే, విపక్ష నేతలు, ఇతర రంగ ప్రముఖుల విషయం పక్కనపెడితే అధికార పార్టీలోని కొంతమంది నిర్మాణాలు కూడా ఎఫ్టీఎల్, బఫర్ జోన్లో ఉన్నట్లు గుర్తించారు. వాటన్నింటి జాబితాను తీసిన హైడ్రా సీఎంకు నివేదిక ఇచ్చింది. ఈ నివేదిక సీఎంఓ నుంచి బయటకు వచ్చింది. అంతకు ముందు పల్లంరాజు నిర్మాణాలను సైతం హైడ్రా కూల్చివేయడంతో సొంత పార్టీ నేతలు సర్దుబాటు పనిలో పడ్డారు. స్థానికంగా సీఎం మాట వినకపోవడం తో హస్తిన ఫ్లైట్ ఎక్కారు. మధ్యవర్తిగా ఓ కన్నడ మంత్రిని వెంటతీసుకుని ఖర్గే దగ్గరే పంచాయితీ పెట్టారు.

### వద్దు... ఆగండి...!

నెల రోజుల నుంచి నగరం, శివారు ప్రాంతాల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తూ దూకుడుగా ముందుకు వెళ్తున్న హైడ్రా కు ప్రభుత్వమే కళ్లెం వేసింది. ఇకపై చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో ఇది వరకే జరిగిన కట్టడాల జోలికి వెళ్లొద్దని హైడ్రా కమిషనర్ కు సూచించింది. నిర్మాణ దశలో ఉన్న పనులను మాత్రమే అడ్డుకుని వాటిని కూల్చేయాలని ఆదేశించింది. ఈ విషయంపై హైడ్రా కమిషన్ రంగనాథ్ స్పష్టత ఇచ్చారు. దీంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ చేసిన ఈ ప్రకటన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. నిన్నటి వరకు హైదరాబాద్ నగరం, శివారు ప్రాంతాల్లో వందలాది ప్రాంతాలు, నివాస, వ్యాపార సముదాయాలు ఏటా ముంపునకు గురవుతున్నాయని, ఈ ప్రకృతి విపత్తి నుంచి బయటపడాలంటే ఆక్రమిత స్థలాల్లో నిర్మించిన కట్టడాలను కూల్చేస్తామన్న రంగనాథ్ అనూహ్యంగా ఈ నిర్ణయం తీసుకోవడం వెనక మతలబు ఏమిటోననే చర్చ జరుగుతున్నది. మరోవైపు హైడ్రా వ్యవస్థనే రద్దు చేయాలంటూ ప్రభుత్వంపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతల నుంచి ఒత్తిడి పెరిగింది. ఈ వ్యవహారంపై ఏఐసీసీ చీఫ్ ఖర్గే నుంచి సీఎం రేవంత్కు పలు సూచనలు వచ్చినట్లు పార్టీలో టాక్. అంతేకాకుండా.. హైడ్రాపై వ్యతిరేకమైన పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు.. ఖర్గే ముందు నిధుల విషయంలోనూ అల్టిమేటం జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్రం నుంచి ఏఐసీసీకి, నేతలకు వచ్చే ఫండ్స్ కూడా బ్రేక్ పడుతాయని వివరించారు. ఫలితంగా.. ఖర్గే దీనిపై నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. ఖర్గే నుంచి వచ్చిన ఆదేశాలతో.. సీఎం రేవంత్ రెడ్డి సైతం వెనక్కి తగ్గినట్లు చెబుతున్నారు.

### వెనదుగుకు వేసినట్టేనా..?

రాష్ట్ర రాజధాని, శివారు ప్రాంతాల్లో కబ్జాకు గురైన వందలాది చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ స్థలాల్లో నిర్మితమైన కట్టడాలను కూల్చి ఆయా భూములను స్వాధీనం చేసుకోవడంతో పాటు భవిష్యత్తులో వాటిలో ఎలాంటి నిర్మాణాలు జరగకుండా ఉండేలా సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొన్ని రోజులు ఆక్రమిత చెరువులు, కుంటల వివరాలు సేకరించిన హైడ్రా.. వాటిలో నిర్మించిన కట్టడాల యజమానులకు నోటీసులు ఇచ్చి నిర్మాణాలను నేటమట్టం చేస్తూ వస్తున్నది. ఈ క్రమంలో ఇప్పటికే సుమారు రెండొందల అక్రమ నిర్మాణాలను కూల్చేసింది. కూల్చివేతల పరంపర మొదలైన ఆదిలోనే జన్వాడలో ఉన్న ప్రతిపక్ష నేత కేటీఆర్ కు సంబంధించినట్లు ప్రచారం జరుగుతున్న ఫాం హౌస్ ను కూల్చివేసేందుకు హైడ్రా రంగం సిద్ధం చేసుకున్నది. దాంతో ఆ ఫాం హౌస్ తనది కాదని తన మిత్రుడి వద్ద లీజుకు తీసుకున్నానని కేటీఆర్ వివరణ ఇవ్వగా, ఆ ఫాం హౌస్ తనదంటూ ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. దాంతో జన్వాడ ఫాం హౌస్ అక్రమంగా నిర్మించి ఉంటే కూల్చివేయాలని హైడ్రాకు సూచించిన హై కోర్టు.. నిబంధనల ప్రకారం కూల్చివేతలు జరగాలని ప్రభుత్వానికి మొట్టికాయలు వేసింది.

**అదే సమయంలో కేటీఆర్ సైతం..** అధికార పార్టీకి చెందిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కేవీపీలతో పాటు సీఎం రేవంత్ రెడ్డి ఫాం హౌస్ సైతం హిమాయత్ సాగర్ బఫర్ జోన్ లో ఉందంటూ ఆరోపించారు. దానికి సంబంధించిన ఆధా రాలు కూడా ఉన్నాయన్న ఆయన.. తను లీజుకు తీసుకున్న ఫాం హౌస్ తో పాటు అధికార పార్టీ నేతల ఆస్తులనూ నేలమట్టం చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఇప్పటికే అక్రమ నిర్మాణాలు చేపట్టిన అధికార పార్టీకి చెందిన ఖైరతాబాద్ దానం నాగేందర్ పై కేసు నమోదు చేసిన హైడ్రా.. ప్రతిపక్ష పార్టీకి చెందిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి సంబంధించిన విద్యా సంస్థలకు నోటీసులు జారీ చేయడం రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలకు దారి తీసింది. ఇదే క్రమంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు వరదల రూపంలో ఖమ్మంను ముంచెత్తడంతో.. అక్కడి ముంపు ప్రాంతాలను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి.. హైడ్రాను రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని సంచలన ప్రకటన చేశారు. సీఎం చేసిన ఈ ప్రకటన ప్రతిపక్ష నేతలను అటుంచితే అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నాయకుల్లో ఇరకాటంలో పడేసింది.

### రాష్ట్ర వ్యాప్తంగా లేనట్టే..?

హైడ్రాను అన్ని జిల్లాలకు విస్తరించేందుకు సీఎం నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. కానీ, ఏర్పాటుచేసిన హైద్రాబాద్లోనే ఆటంకాలు రావడం, ఏకంగా ఏఐసీసీ చీఫ్ నుంచే ఒత్తిడి రావడంతో.. ఇక హైడ్రా విస్తరణకు బ్రేక్ పడింది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటుపై ఫైల్ కదలాల్సి ఉండగా.. ఇప్పటి వరకు ఎలాంటి నివేదికలు ఇవ్వలేదు. దీంతో విస్తరణ ఆగిపోయినట్టే.

## హైయ్యోడ్రా...

- తడబడుతున్న కమిషన్..
- రాజకీయ ఒత్తిళ్లే కారణమా..?
- ఆరంభశూరత్వంగా కూల్చివేతలు
- నో ఎఫ్ టీఎల్.., నో బఫర్ జోన్..
- కేవలం నాలాలపైనే ఫోకస్

**జనపదం, బ్యూరో:** హైడ్రా... తడబడుతున్నది. దూసుకెళ్లాలనుకున్న కమిషన్ ను అందరూ కలిసి తాళ్లేసి మరీ గట్టిగా గుంజుతుండడంతో కదలలేకపోతున్నది. అంతేలే మంచి చేయాలంటే ఎవరికి నచ్చదు అన్నట్టుగా, ప్రజా సమస్యల పరిష్కారానికి కారణమైన కబ్జాల భరతం పట్టే పనికి అంతా అడ్డంకులే సృష్టించడంతో గమ్యం దూరమవుతున్నది. నిన్నటి వరకు ఎఫ్టీఎల్, బఫర్ జోన్లే లక్ష్యంగా వెళ్లిన హైడ్రా.. ఇప్పుడు నాలాలే ముద్దు.., మరేమీ వద్దు.. అన్నట్టుగా మదనపడుతూనే తనను తాను నచ్చజెప్పుకుంటున్నది. దీంతో కొన్ని రోజులు నిర్మాణాల కూల్చివేత కు బ్రేక్ వేసినట్టే కనిపిస్తోంది. కూల్చివేతలు ఆపి చెరువుల పై సర్వే షురూ చేసినట్లు తెలుస్తోంది.

### తడబాటు ఎందుకు..?

హైడ్రా ఏర్పాటు చేసిన కొత్తలో చెరువుల్లో ఆక్రమణలపై మాత్రమే ఫోకస్ చేశారు. ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ల రక్షణ టార్గెట్ గా పెట్టుకొని కూల్చివేతలు సాగించి.. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. అయితే కొంతమంది అన్నట్లుగానే ఇది ఆరంభ శూరత్వంగానే మిగిలిపోయిలా కనిపిస్తోంది. ఎన్ కన్వెన్షన్ లాంటి భారీ కట్టడాన్ని కూల్చిన హైడ్రా ఇప్పుడు పెద్దపెద్ద లీడర్ల నిర్మాణాల వైపు వెళ్లడం లేదు. కేవలం నాలాలపై దృష్టిసారిస్తుంది. అయితే ఇందుకు.. రాజకీయ ఒత్తిళ్లే కారణమనే మాటలు వినిపిస్తున్నాయి.

### చెరువుల నుంచి నాలాల వైపు..

చెరువుల ఆక్రమణలపై దూసుకెళ్లిన బుల్డోజర్ల రూట్ మారినట్టే కనిపిస్తోంది. ఒత్తిడులో మరిఇంకేందో తెలియదు కానీ... తాజాగా నాలాల ఆక్రమణలపై హైడ్రా ఫోకస్ పెట్టింది. ఇన్ని రోజులు చెరువుల కు సంబంధించిన ఎఫ్ టీఎల్ పైన ఫోకస్ చేసిన హైడ్రా ఇప్పుడు వర్షాకాలం మొత్తం నగర పరిధిలో ఉన్న నాలాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిసైడ్ అయింది. సోమవారం దాదాపు మూడు గంటల సేపు హైడ్రా, రెవెన్యూ,ఇరిగేషన్ తో సమావేశమై.. ఇన్ని రోజులు చేసిన కూల్చివేతలు,రాబోయే రోజుల్లో చేపటాల్సిన కార్యాచరణ పై దిశానిర్దేశం చేశారు. వర్షం అధికంగా కురిసినప్పుడే అసలు ఎన్ని నాలాలు ఆక్రమణకు గురయ్యాయి అనేది తేలుతుందని హైడ్రా భావిస్తోంది. నాలాల ఆక్రమణల జాబితా సిద్ధం చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఈ వర్షాకాలంలోపు నాలాలను, బఫర్ జోన్లను ఆక్రమించిన నిర్మాణాలను తొలగించేందుకు ప్రణాళిక రెడీ చేశారు. ఇప్పటికే రాంనగర్ లోని నాలాపై వైన్ షాపు నిర్వహిస్తున్న రెండతస్తుల భవనాన్ని కూల్చివేశారు. జీహెచ్ ఎంసీ పరిధిలో 370 కిలో మీటర్ల మేర ప్రవహిస్తున్న మేజర్ నాలాలు ఉన్నాయి.

## నీ గాలి తీసేది ఆ'ట్యూబు'లే..

**యూట్యూబ్ లపై సీఎం వ్యాఖ్యలు అర్థరహితం..**
**మాజీ మంత్రి హరీష్ రావు..**
**ఛానెల్లను తక్కువ చేసి మాట్లాడడంపై ఫైర్..**

**జనపదం, హైదరాబాద్:** య్యూట్యూబ్ లను తక్కువ చేసి మాట్లాడటం విడ్డూరంగా ఉందని సీఎం రేవంత్ పై మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజమెత్తారు. య్యూట్యూబులను నమ్ముకొని అధికారంలోకి వచ్చి ఇప్పుడు విమర్శలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓడ దాటెదాక ఓడ మల్లన్న ఓడ దాటినంక బోడి మల్లన్న అన్న చందంగా రేవంత్ తీరు ఉందని, రేవంత్ అక్రమాలను, అవినీతిని, దొల్ల తనాన్ని అవి బయటపెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రిగా మాట తప్పిన తీరును, ప్రజలకు చేసిన మోసాన్ని యూట్యూబ్ చానెళ్లు ఎండగడుతున్నాయని అక్కసుతోనే అలా అంటున్నాడన్నారు. బిడ్డా... నిన్ను గద్దె దించడానికి ఈ రాష్ట్రంలోని యూట్యూబ్ చానెళ్లు అన్నీ ఒక్కటవుతాయని హరీష్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు.

# మరీ అంత వీపీలమా..!?

(మొదటిపేజీ తరువాయి) చట్టం చెబుతున్న విషయాన్ని నొక్కిగుర్తు చేస్తూ, కోర్టుకు కూడా స్పీకర్ కార్యాలయం త్వరలో గట్టి రిప్లయ్ ఇచ్చే అవకాశం కనిపిస్తున్నది. కాగా, కోర్టు తీర్పు, పీఏసీ నియామకం అనంతరం కాంగ్రెస్, బీఆర్ఎస్ కీలక నేతల వ్యాఖ్యలు ఆసక్తికర రాజకీయాలకు తెరలేపుతున్నాయి.

### ఫిరాయింపు ఎమ్మెల్యేకు పదవి ఎలా?

అసెంబ్లీ వ్యవస్థలో పీఏసీ చాలా కీలకం. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి పైసాను కమిటీ క్షుణ్నంగా పరిశీలిస్తుంది. ఆయా అంశాలపై అసెంబ్లీకి నివేదికలు ఇస్తుంది. అలాంటి కీలక పదవిని పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేకు కట్టబెట్టడంపై రాజకీయ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. నిజానికి ఈ పదవి కోసం మాజీ ఆర్థిక మంత్రి హరీశ్రావు పేరును బీఆర్ఎస్ పార్టీ ప్రతిపాదించినట్టు సమాచారం. కానీ బీఆర్ఎస్ నుంచి గెలిచిన (మూడు సార్లు ఎమ్మెల్యే) గాంధీని పీఏసీ చైర్మన్ గా నియమించారు. దీనిపై పలువురు అధికార పార్టీపై విరమర్శలు గుప్పిస్తున్నారు.

### కాంగ్రెస్ నిర్ణయం కరెక్ట్ కాదు..

**-బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి**



పీఏసీ చైర్మన్ విషయంలో సంప్రదాయాలకు విరుద్ధంగా కాంగ్రెస్ సర్కార్ పని చేసింది. కోర్టు నిర్ణయానికి వ్యతిరేకంగా నడుచుకుంటూ రేవంత్ ప్రభుత్వం మరో తప్పిదానికి పాల్పడింది. ఇతర పార్టీలో గెలిచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేకు పీఏసీ చైర్మన్ గా నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నాం. పార్టీ మారిన మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి పైసా గురించి, తప్పుడు లెక్కల గురించి ప్రశ్నించేది పీఏసీ కమిటీ. ఎప్పుడు కూడా ప్రతిపక్షానికి ఇవ్వడం జరుగుతుంది. కాని ఆ ఆనవాయితీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకోవడం సబబు కాదు. బీఆర్ఎస్ ముగ్గురు పేర్లు పంపినప్పటికీ..తమ ఇష్టానుసారంగా చేయడం రాజ్యాంగ విరుద్ధమే. సీనియర్ నాయకులు విభేదిస్తున్నప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారు. అందుకే పార్టీలో ఎమ్మెల్యేల చేరికల సమయంలో ఎక్కడా సీనియర్ నాయకులు కనిపించడం లేదు. ప్రజలకిచ్చిన హామీలను వదిలేసి, వరద బాధితులకు సాయం వదిలేసి, కాంగ్రెస్ నేతలు కలెక్షన్ల బిజీలో ఉన్నారు. ఆర్ ట్యాక్స్, ఆర్ ఆర్ ట్యాక్స్ , ఆర్ ఆర్ ఆర్ ట్యాక్స్ , బీ ట్యాక్స్, యూ ట్యాక్స్ ఇలా కలెక్షన్లలో మునిగితేలుతున్నారు. రుణమాఫీ పూర్తిగా అమలు చేయకుండా, రైతుబంధు ఇవ్వకుండా కేవలం పేపర్ ప్రకటనలకే పరిమితమయ్యారు. ఇప్పటికైనా కోర్టు తీర్పునకు అనుగుణంగా పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ ను కోరుతున్నాం.

### ఏ లెక్కన ఇచ్చినట్టు..

**-మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి**



పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ను పార్టీ మారిన వ్యక్తికి కాంగ్రెస్ ఏ లెక్కన ఇచ్చినట్లు అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. ఎప్పుడైనా ప్రతిపక్ష నేత సూచించిన సభ్యుడికి పీఏసీ చైర్మన్ అవకాశం ఇచ్చే సంప్రదాయం కొనసాగుతోందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే అరికేపూడి గాంధీకి పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వడం అసెంబ్లీ సంప్రదాయాలకు విరుద్ధమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్ష సభ్యుడికి పీఏసీ చైర్మన్ పదవి దక్కలేదని, ప్రభుత్వం చేసే లోపాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రతిపక్ష పార్టీకి అవకాశం ఇవ్వలేదని మండిపడ్డారు. అరికేపూడి గాంధీని పీఏసీ చైర్మన్ గా చేసే క్రమంలో ప్రభుత్వం తప్పులు చేసిందని, ప్రాసెస్ ఆఫ్ ఎలక్షన్ చేయకుండా సెలెక్షన్ చేశారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో, కేంద్రంలో పీఏసీ చైర్మన్ పదవిని ప్రతిపక్ష పార్టీకి ప్రతిపక్ష నేత సూచించిన వారికి ఇస్తారని తెలిపారు. 1958-59 నుండి ప్రతిపక్ష పార్టీ సభ్యుడు పీఏసీ చైర్మన్ గా ఎన్నిక అయ్యే సంప్రదాయం కొనసాగుతోందని గుర్తు చేశారు. ఢిల్లీలో ఏ రాజ్యాంగం ప్రకారం కాంగ్రెస్ పార్టీకి పీఏసీ చైర్మన్ పదవి వచ్చిందని, తెలంగాణలో ఏ రాజ్యాంగం ప్రకారం బీఆర్ఎస్ పార్టీకి పీఏసీ చైర్మన్ పదవి రాలేదని ప్రశ్నించారు. పీఏసీ చైర్మన్ ఎన్నికపై స్పీకర్ పునరాలోచన చేయాలన్నారు. కాంగ్రెస్ నిర్ణయంపై గవర్నర్ ను కలవడమా లేక కోర్టులకు వెళ్లే దానిపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

### ప్రతిపక్షానికే ఇవ్వాలని ఉందా..

**-పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ**



నేను కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోలేదు. నాకు కప్పిన కండువా పైన ఏ పార్టీ గుర్తులు లేవు. దేవుడి శాలువా మాత్రమే కప్పుకున్న. సీఎం రేవంత్ రెడ్డి నాకు పాత మిత్రుడు. అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని రేవంత్ రెడ్డి చెప్పారు. పార్టీలో చేరమని రేవంత్ రెడ్డి నన్ను ఎప్పుడు కోరలేదు. ప్రతిపక్షానికి పీఏసీ ఇవ్వాలని రూల్ ఏమైనా ఉందా. నాకు పీఏసీ ఇస్తే ఓర్వలేని తనం ఎందుకు. మనం ఏం చేశామో కూడా గుర్తుంచుకోవాలి. ఆనాడు శ్రీధర్ బాబుకి పీఏసీ ఇవ్వకుండా పార్టీకి సంబంధంలేని ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యే కు పీఏసీ కట్టబెట్టాం. ప్రజాస్వామ్యం ఖునీ గురించి మాట్లాడుతున్నారు. వారికి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత లేదు. మీ వాదన చెప్పండి చర్చకు సిద్ధం. మీకు సమాధానం చెప్పేందుకు నేను రెడీ. మనం చేసిన తప్పులను మర్చిపోతే ఎట్ల? పీఏసీ చైర్మన్ కోసం ఎమ్మెల్యేల సంతకాలతో రూల్స్ ప్రకారం నామినేషన్ వేసా. తప్పులుంటే వెళ్లి స్పీకర్ ను అడగండి. ఉప ఎన్నిక వస్తే ఎదుర్కోవడానికి సిద్ధం. మళ్లీ నేనే గెలుస్తా.

### వాళ్లకు గొడవలుంటే మేమేం చేస్తాం..

**మంత్రి శ్రీధర్ బాబు..**



శాసనసభ నిబంధనల ప్రకారమే పీఏసీ చైర్మన్‌ను నియమించారని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ప్రజా పద్దుల కమిటీ చైర్మన్‌గా అరికెపూడి గాంధీ నియామకంపై బీఆర్ఎస్‌నాయకులు చేస్తున్న విమర్శలను మంత్రి తిప్పికొట్టారు. తాను ప్రతిపక్ష ఎమ్మెల్యేను అని పీఏసీ చైర్మన్ స్వయంగా చెప్పారని అన్నారు. బీఆర్ఎస్ నేతలతో పీఏసీ చైర్మన్‌కు అభిప్రాయభేదాలుంటే తమకేం సంబంధమని శ్రీధర్ బాబు అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తి గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని ధ్వజమెత్తారు. జీరో ఎంపీ సీట్లు ఇచ్చినా బీఆర్ఎస్ నేతల వైఖరి మారలేదని శ్రీధర్ బాబు ఆక్షేపించారు. ఫలితాల తర్వాత కూడా ఏదో జరుగుతుందని బీఆర్ఎస్ నేతలు కొన్ని రోజులు తిరిగారన్న శ్రీధర్ బాబు అంత తిరిగిన తర్వాత కూడా ప్రజలు మరోసారి తీర్పు ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వాన్ని నడపాలని ప్రజలు తమకు తీర్పు ఇచ్చారని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యవ్యవస్థలను కాలరాసిందని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వ్యవస్థలను తారుమారు చేసి అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్న భట్టి విక్రమార్కను ఇబ్బంది పెట్టారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్‌కు కాకుండా పీఏసీ పదవి ఎవరికి ఇచ్చారో అందరూ చూశారని, దెయ్యాలు వేదాలు వల్లించినట్లు బీఆర్ఎస్ నేతల తీరు ఉందన్నారు. ప్రజలు, సమాజం కోరుకునే విధంగా తమ ప్రభుత్వ పాలన ఉంటుందని వెల్లడించారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు.

## గల్ఫ్‌లో మెదక్ జిల్లా వాసి మృతి

**జనపదం, మెదక్ :** ఇద్దరు పిల్లల పెళ్లిళ్లు, అప్పులు తీర్చేందుకు గల్ఫ్ కు వెళ్లిన మరో మెదక్ జిల్లా వాసి మరణించాడు. ఈ విషాదకర సం ఘటన జిల్లాలోని హవేలీ ఘనపూర్ మండలం సుల్తాన్ పూర్ తండాలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నా యి. సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడం తో రమావత్ వస్రాం (40) అప్పులు తీర్చేందు కు, ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చే యాలనే ఉద్దేశంతో గత నెల 10న నిజామాబాద్ కు చెందిన ఏజెంట్ ద్వారా దుబాయ్ కి వెళ్లారు.

ఈ క్రమంలో వారం రోజుల క్రితం రమావత్ వస్రాం మృతి చెందినట్లు ఏజెంట్ ద్వారా కుటుంబ సభ్యులకు తెలి సింది. అయితే వ స్రాం మృ తికి గల కారణా లు ఇంకా తెలియ రాలేదు. మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు గ్రామానికి చెందిన నాయకులు మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా మెదక్ మండలం తిమ్మక్కపల్లి తండాకు చెందిన రాట్ల సూర్య కూడా ఈ నెల 1న అబుదాబీలో మరణించగా మృతదేహం కోసం కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు.

## మూడు నెలల్లో పూర్తి చేయాలి

- బీసీ కులగణనపై హైకోర్టు ఆదేశాలు
- కులగణనపై సుప్రీం ఉత్తర్వులున్నాయన్న పిటిషనర్
- తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న ఏజీ
- మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశం



**జనపదం, హైదరాబాద్:** బీసీ కులగణన 3 నెలల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. కులగణన పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సూచించింది. రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టాలంటూ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ హై కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ ను మంగళవారం విచారించిన న్యాయస్థానం ప్రభుత్వానికి కీలక ఆదేశాలను జారీ చేసింది. పిటిషనర్ తరఫున నాగుల అడ్వకేట్ శ్రీనివాస్ యాదవ్ వాదనలు వినిపించారు. బీసీ కులగణనపై సుప్రీంకోర్టు ఉత్తర్వులున్నాయని పిటిషనర్ హైకోర్టు దృష్టికి తీసుకురాగా అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అడ్వకేట్ జనరల్ తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం మూడు నెలల్లో కులగణన చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణ ముగించింది.

### కులగణనపై సర్కార్ కసరత్తు..

రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టేందుకు ప్రభుత్వం సైతం కసరత్తు చేస్తోంది. బీసీ కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగా ఇప్పటికే స్టేట్ బీసీ కమిషన్ కు కొత్త ఛైర్మన్ సహా సభ్యులను నియమించింది. మరోపక్క స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే అంశంపై చర్చ జోరుగా సాగుతోంది. ఇప్పటికే సర్పంచ్ ల పదవీకాలం ముగిసినప్పటికీ , ఇంకా ఎన్నికలకు సంబంధించి ఎలాంటి అప్ డేట్ ను ప్రభుత్వం ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో కులగణన పూర్తి చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ సహా పలువురు కీలక నేతలు ఇప్పటికే ప్రకటనలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని ప్రభుత్వంపై ప్రతిపక్షాల నుంచి కూడా ఒత్తిడి వస్తోంది. తాజాగా హైకోర్టు కూడా బీసీ కులగణనపై ఆదేశాలు ఇవ్వడం, దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశం చర్చానీయంశంగా మారింది.

## వాళ్లకు జీతాలివ్వరా..?

- టీవీవీపీ ఆస్పత్రుల సిబ్బంది ఇబ్బందులు పట్టవా..?
- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ మంత్రి హరీశ్ రావు



**జనపదం, హైదరాబాద్:** తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో (టీవీవీపీ) పని చేస్తున్న సిబ్బందికి వేతనాలు చెల్లించకపోవడంపై మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వేతనాలు చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరు నెలలుగా శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడం అమానుషమని అన్నారు. ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నట్లు చెప్పుకునే ముఖ్యమంత్రికి వీరి వెతలు కనిపించకపోవడం శోచనీయమని విమర్శించారు. జీతాలు చెల్లించాలని కోరుతూ సిబ్బంది ఎన్నిసార్లు నిరసనలు తెలిపినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా ఉండటం లేదని అన్నారు. వారి గోడును పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విషజ్వరాలు విజృంభించి రోగులతో ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్న సమయంలో, ఆసుపత్రుల నిర్వహణను ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు విడుదల చేయకుండా చోద్యం చూస్తున్నదని అన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం ఆసుపత్రి సిబ్బందికి శాపంగా మారిందని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, టీవీవీపీ ఆసుపత్రుల్లో పని చేస్తున్న సిబ్బందికి వెంటనే జీతాలు చెల్లించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని బీఆర్ఎస్ తరుపున డిమాండ్ చేశారు.



## అవసరాన్నిబట్టి బస్సులు కొనండి

- సంస్థ రుణ భారం తగ్గింపునకు ప్రయత్నించాలి
- ఆర్టీసీ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 83.42 కోట్ల మంది మహిళల ఉచిత ప్రయాణం

**జనపదం, హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రజావసరాలకు అనుగుణంగా నూతన బస్సుల కొనుగోలుకు రంగం సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పెరిగిన అవసరాలు, నూతన మార్గాలను ఇందుకు ప్రతిపాదన చేసుకోవాలని ఆయన సూచించారు. టీజీ ఆర్టీసీపై రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. మహాలక్ష్మి పథకం మహిళలు వినియోగించుకుంటున్న తీరుపై ఆరా తీశారు. మహాలక్ష్మి పథకం అద్భుతంగా ఉందని, ఇప్పటి వరకు 83.42 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, ఇందుకు సంబంధించి మహిళా ప్రయాణికులకు రూ.2,840.71 కోట్లు ఆదా అయ్యాయని మంత్రి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీలో 7,292 బస్సుల్లో మహాలక్ష్మి పథకం వర్తిస్తోందని ఆయన వివరించారు. అనంతరం వివిధ బ్యాంకులు, ఉద్యోగుల భవిష్యత్ నిధి ఖాతా నుంచి వాడుకున్న నిధులు, విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు తదితరాలకు కలిపి రూ.6,322 కోట్ల రుణాలు ఉన్నట్లు అధికారులు వివరించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు చెల్లిస్తున్న వడ్డీ రేటు ఎక్కువగా ఉందని.. వడ్డీ రేట్ల తగ్గింపు, అప్పుల రీకన్‌స్ట్రక్చన్‌పై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సంస్థపై క్రమంగా రుణభారం తగ్గించాలని ఆయన సూచించారు. మహాలక్ష్మి పథకంతో ఆక్యుపెన్సీ రేటు పెరగడంతో పాటు ప్రభుత్వం చెల్లిస్తున్న రీయింబర్స్‌మెంట్‌తో సంస్థ లాభాల్లోకి వస్తోందని అధికారులు తెలిపారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, షానవాజ్ ఖాసీం, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పాల్గొన్నారు.

## 16న ఢిల్లీకి సీఎం..

**జనపదం, బ్యూరో:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 16న ఢిల్లీ వెళ్లనున్నారు. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టులపై కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వంతో చర్చించనున్నట్లుగా తెలుస్తోంది. సీఎంతో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యవర్గ కూర్పుపై అధిష్టానంతో జరిగే భేటీలో సీఎం చర్చించనున్నారు. ఇప్పటికే పీసీసీ అధ్యక్షుడిని ప్రకటించిన విషయం విధితమే. నామినేటెడ్ పోస్టుల విషయంపై రేవంత్ రెడ్డి దృష్టి పెట్టినట్లుగా తెలుస్తోంది. కేబినెట్ విస్తరణకు సంబంధించి చాలా రోజులుగా ఏఐసీసీ కసరత్తు చేస్తున్నప్పటికీ, సామాజిక సమీకరణాల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో వాయిదా పడుతూ వస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో 16వ తేదీన మరోసారి సీఎం ఢిల్లీ వెళ్లి పార్టీ అగ్ర నాయకత్వంతో చర్చిం చనున్నట్లు తెలుస్తోంది. నామినేటెడ్ పోస్టులకు సంబంధించి ఇప్పటికే 27 మంది పేర్లతో ఓ జాబితా సిద్ధమైనట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

## రూపిరెడ్డి పల్లిలో డెంగీతో ఒకరి మృతి

**జనపదం, వరంగల్:** రేగొండ మండలం రూపిరెడ్డి పల్లి గ్రామంలో మంచిపెల్లి మొగిలి (55) డెంగీ జ్వరంతో మంగళవారం మృతి చెందాడు. బంధువుల కథనం మేరకు.. మొగిలి పది రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా, పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించుకున్నా తగ్గకపోవడం తో వరంగల్ లో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు.మొగిలి డెంగీ తో బాధపడుతున్నాడని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో జ్వరంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు.

# హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం..

- హైకోర్టు గ్రీన్ సిగ్నల్
- చివరి సమయంలో ధిక్కరణ పిటిషన్ సరికాదు
- హైడ్రాను ప్రతివాదిగా చేయలేమన్న ధర్మాసనం

**జనపదం, హైదరాబాద్ :** హుస్సేన్‌సాగర్‌లో వినాయక విగ్రహాల నిమజ్జనాలు చేసేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నిమజ్జనాలు జరుగుతున్న చివరి సమయంలో ధిక్కరణ పిటిషన్ సరికాదని కోర్టు పేర్కొంది. 2021 ఆదేశాల ప్రకారం గణేశ్ నిమజ్జనం చేయాలని హైకోర్టు మంగళవారం కీలక తీర్పునిచ్చింది. వివరాలిలా ఉన్నాయి. హుస్సే న్‌సాగర్‌లో విగ్రహాలను నిమజ్జనం చేయొద్దని ఇటీవల లాయర్ వేణుమాధవ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గతంలో నిమజ్జనాలు చేయొద్దని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలనే అమలు చే యాలని కోరారు. ఇందుకోసం హైడ్రాను కూడా పిటిషన ర్‌గా ప్రతివాదిగా చేర్చాలని అభ్యర్థించారు. అయితే ఈ పిటిషన్‌పై మంగళవారం ధర్మాసనం విచారణ చేపట్టింది. ముందుగా హైడ్రాను ప్రతివాదిగా చేర్చడాన్ని కోర్టు తిరస్కరించింది. ఆ తర్వాత పిటిషనర్ వాదనలతో ఏకీభవించిన కోర్టు.. హుస్సేన్‌సాగర్‌లో వినాయక విగ్రహ నిమజ్జనాలు చేసేందుకు పర్మిషన్ ఇచ్చింది. అయితే కోర్టు ధిక్కరణపై పిటిషనర్ సరైన ఆధారాలు చూపించలేకపోయారు. దీంతో నిమజ్జనాలు జరుగుతున్న చివరి సమయంలో ధిక్కరణ పటిషన్ సరికాదని కోర్టు పేర్కొంది. 2021 ఆదేశాల ప్రకారం నిమజ్జనం చేయాలని స్పష్టం చేసింది. గత ఆదేశాల సమయంలో హైడ్రా లేదని, అలాంటప్పుడు ఇప్పుడెలా హైడ్రాను పార్టీ చేస్తామని ప్రశ్నించింది. అధికారుల చర్యలను సమర్థించింది. అలాగే పీఓపీతో విగ్రహాలు తయారు చేయడంపై నిషేధం ఇవ్వలేమని, వాటిని తాత్కాలిక పాండ్స్‌లో నిమజ్జనం చేసుకోవచ్చని తెలిపింది. పిటిషనర్ ప్రత్యేక ఆదేశాల కోసం రిట్ పిటిషన్ కూడా వేయొచ్చని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఇదిలాఉండగా.. ఈ వ్యవహారంపై కోర్టులో విచారణ జరుగుతుండగా హుస్సేన్‌సాగర్‌లో వినాయక నిమజ్జనాలకు పర్మిషన్ లేదంటూ పోలీసులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సాగర్‌లో గణేశ్ నిమజ్జనం చేయకుండా ఇనుప కంచెలు కూడా ఏర్పాటు చేశారు.




- రాష్ట్రానికి మరో నాలుగు మెడికల్ కాలేజీలు..
- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కేంద్రం..
- ఈ ఏడాది 8 కాలేజీలు సాధించిన రాష్ట్ర సర్కార్
- ఒక్కో కాలేజీలో 50 సీట్లు..
- అందుబాటులోకి 400 ఎంబీబీఎస్ సీట్లు
- కేంద్రం, సీఎంకు మంత్రి దామోదర కృతజ్ఞతలు

# ఔర్.. చార్..

**జనపదం, బ్యూరో :** తెలంగాణాలో మరో 4 మెడికల్ కాలేజీలకు కేంద్ర ఆరోగ్య శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ దరఖాస్తు చేసిన యాదాద్రి, మెదక్, మహేశ్వరం, కుత్బుల్లాపూర్ కాలేజీలకు పర్మిషన్ ఇవ్వాలని నేషనల్ మెడికల్ కమిషన్‌ను కేంద్రం ఆదేశించింది. ఇదే విషయాన్ని తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం లేఖ పంపించింది.

### 4090కి పెరిగిన మెడికల్ సీట్లు

ఒక్కో కాలేజీలో 50 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున, మొత్తం 200 సీట్లు నాలుగు మెడికల్ కళాశాలల్లో అందుబాటులోకి రానున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే ములుగు, నర్సంపేట, గద్వాల్, నారాయణపేట్ మెడికల్ కాలేజీలకు నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతి ఇచ్చింది. మొత్తం 8 కాలేజీల్లో కలిపి 400 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ప్రభుత్వ కాలేజీల్లోని మొత్తం సీట్ల సంఖ్య 4090కి పెరిగింది.

### ఫస్ట్ అప్పీల్‌తో 4 కాలేజీలకు అనుమతి

ప్రభుత్వం ఈ ఏడాది మొత్తం 8 కాలేజీలకు దరఖాస్తు చేసింది. జూన్‌లో ఈ కాలేజీల పరిశీలనకు వచ్చిన ఎన్ఎంసీ అధికారులు, ఇక్కడ కాలేజీల ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాలు లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. టీచింగ్ స్టాఫ్, సౌకర్యాలు లేకుండా అనుమతులు ఇవ్వలేమన్నారు. అధికారులు ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకురావడంతో, అవసరమైన నిధులను కొత్త సర్కార్ కేటాయించింది. ఎన్ఎంసీ లేవనెత్తిన లోపాలను సవరించి ఫస్ట్ అప్పీల్‌కు వెళ్లింది. ఈ అప్పీల్ తర్వాత ములుగు, నర్సంపేట, గద్వాల్, నారాయణపేట్ కాలేజీలకు పర్మిషన్ ఇచ్చిన ఎన్ఎంసీ, మిగిలిన 4 కాలేజీలకు పర్మిషన్ ఇవ్వలేదు. ఈ కాలేజీల అనుమతులపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా రెగ్యులర్‌గా మానిటర్ చేసి, యాదాద్రి, మెదక్, మహేశ్వరం, కుత్బుల్లాపూర్ కాలేజీలకు స్టాఫ్‌ను నియమించారు. ఇటీవల జరిగిన జనరల్ ట్రాన్స్‌ఫర్లలో తొలుత ఆ 4 కాలేజీల్లోని ఖాళీలను నింపిన తర్వాతే, మిగిలిన కాలేజీల్లోకి స్టాఫ్‌ను బదిలీ చేశారు. ప్రొఫెసర్ల కొరతను అధిగమించేందుకు ఎలిజిబిలిటీ ఉన్న వారికి ప్రమోషన్లు ఇప్పించారు. కాలేజీ, హాస్పిటల్‌లో ఉండాల్సిన లాబోరేటరీ, డయాగ్నస్టిక్స్ ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేసేందుకు నిధులు కేటాయించారు. ఇలా ఎన్ఎంసీ లేవనెత్తిన అన్ని లోపాలను సవరించి కేంద్ర ఆరోగ్య శాఖకు సెకండ్ అప్పీల్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా ఆదేశాలతో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ వాణి, ఇతర ఆఫీసర్లు, డాక్టర్ల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర ఆరోగ్య శాఖ, ఎన్ఎంసీ అధికారులను కలిశారు. కాలేజీల ఏర్పాటుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని, ఇంకేమైనా అవసరం ఉంటే అవి కూడా సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. ఈ నేపథ్యంలోనే మొత్తం అన్ని కాలేజీలకు అనుమతులు ఇవ్వాలని కేంద్ర ఆరోగ్య శాఖ నిర్ణయించింది. లెటర్ ఆఫ్ పర్మిషన్ జారీచేయాలని ఎన్ఎంసీని ఆదేశించింది. కాలేజీలకు అనుమతులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి, సకాలంలో అవసరమైన నిధులు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డికి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా కృతజ్ఞతలు తెలిపారు. మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ వాణి, అడిషనల్ డీఎంఈ విమలా థామస్, ఇతర ఉన్నతాధికారులను మంత్రి అభినందించారు.




# కోఠి మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు..

- మహిళా కమిషన్ సభ్యురాలిగా ఐలమ్మ మనుమరాలు
- ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగిస్తాం..
- వర్ధంతి లో సీఎం రేవంత్ రెడ్డి

**జనపదం, హైదరాబాద్ :** తెలంగాణలో ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం రవీంద్ర భారతిలో నిర్వహించిన చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి కార్యక్రమంలో సీఎం పాల్గొని ఆమెకు నివాళులర్పించారు. అనతరం ఆయన మాట్లాడుతూ ఐలమ్మ కుటుంబ సభ్యులు ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉండాలని తాము భావిస్తున్నామని, అందులో భాగంగానే ఆమె మనుమరాలు శ్వేతను మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. తెలంగాణలో ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగిస్తామని తెలిపారు. దొరల చేతుల్లో ఉన్న వేలాది ఎకరాలను పేదలకు చేరాలని ఐలమ్మ పోరాటం చేశారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఇందిరా గాంధీ భూ సంస్కరణలు తెచ్చారని గుర్తుచేశారు. భూమి పేదవాడి ఆత్మగౌరవం.. అందుకే ఇందిరమ్మ పేదలకు లక్షల ఎకరాలను పంచిపెట్టారని ఉద్ఘాటించారు. ధరణి ముసుగులో కొందరు పేదల భూములను గుంజుకునే కుట్ర చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. పేదల భూములను కాపాడేందుకే ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.





# ఫిఫ్టీ పర్సెంట్ ఇవ్వండి..

- కేంద్ర పన్నుల్లో నిధుల వాటా 50 శాతానికి పెంచాలి
- బలమైన పునాదులున్నా ఆర్థిక సవాళ్లు ఎదుర్కుంటున్నాం..
- గత సర్కార్ నిర్వాకంతో రూ.6.85 లక్షల కోట్ల రుణభారం
- తెలంగాణను ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం..
- 16వ ఆర్థిక సంఘం సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**జనపదం, హైదరాబాద్ :** కేంద్ర పన్నుల్లో రాష్ట్రానికి ఇచ్చే నిధుల వాటా 50 శాతానికి పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు ఇదే కోరుకుంటున్నాయని, ప్రస్తుతం కేంద్రం నుంచి వస్తున్న 41 శాతం వాటాలో కూడా అనేక కోతలు పడుతున్నాయన్నారు. దీని వల్ల రాష్ట్రాలు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రాలకు ఇచ్చే పన్నుల వాటాను ఖచ్చితంగా 50 శాతం మేరకు ఇవ్వాల్సిందేనని 16వ ఆర్థిక సంఘం సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి గట్టిగా తమ వాదనను వినిపించారు. మంగళవారం ప్రజా భవన్ లో జరిగిన 16వ ఆర్థిక సంఘం ముగింపు సమావేశంలో సీఎం పాల్గొని మాట్లాడారు. దేశంలోనే తెలంగాణ యంగెస్ట్ స్టేట్ అని అన్నారు. మా రాష్ట్రాన్ని ది ఫ్యూచర్ స్టేట్ గా పిలుస్తున్నామన్నారు. బలమైన పునాదులు, చక్కటి ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికీ, ఆర్థికంగా అనేక సవాళ్లను ఎదుర్కుంటున్నామన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న భారీ రుణ భారం ప్రస్తుతం రాష్ట్రానికి సవాల్ గా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రుణ భారం రూ.6.85 లక్షల కోట్లకు చేరుకుందన్నారు. ఇందులో బడ్జెట్ రుణాల తో పాటు ఆఫ్-బడ్జెట్ రుణాలు కూడా ఉన్నాయని వివరించారు. గత పదేళ్లలో ప్రభుత్వం భారీగా అప్పులు తీసుకుందని, దీని వల్ల రాష్ట్ర ఆదాయంలో ఎక్కువ భాగం రుణాన్ని తిరిగి చెల్లించడానికి వెచ్చించాల్సిన పరిస్థితిని తీసుకొచ్చిందన్నారు. రుణాలు, వడ్డీ చెల్లింపులు ఇప్పుడు సక్రమంగా నిర్వహించకపోతే రాష్ట్ర పురోగతిపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రుణాల సమస్యను పరిష్కరించేందుకు మాకు తగిన సహాయం, మద్దతు ఇవ్వాలని కోరారు. కనీసం రుణాన్ని రీ స్ట్రక్చర్ చేసే అవకాశమైనా ఇవ్వాలని లేదా మాకు అద నపు ఆర్థిక సహాయాన్ని అందించాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాలకు ఇచ్చే పన్నుల వాటాను కేంద్రం పెంచితే దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ గా మార్చాలని ప్రధాని నరేంద్ర మోడీ ఎంచుకున్న లక్ష్య సాధన కూడా నెరవేరతుందన్నారు. తమ రాష్ట్రం పక్షాన పూర్తిగా సహకారిస్తామని, అలాగే తెలంగాణను ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామన్నారు.

# ఆదాయం అంతా అప్పులకే..

- అందుకే రీస్ట్రక్షరింగ్‌చేయాలి
- కేంద్ర పథకాల వినియోగానికి నిబంధనలు అడ్డంకి
- తెలంగాణలో ఆదాయ అసమానతలు ఎక్కువ
- చాలా తక్కువ మంది చేతుల్లోనే ఎక్కువ సంపద కేంద్రీకృతం
- 16వ ఆర్థిక సంఘం సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి




**జనపదం, హైదరాబాద్ :** ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఆదాయమంతా అప్పులు కట్టేందుకే సరిపోతుందని, అందుకే గత అప్పులను రీస్ట్రక్చరింగ్ చేయాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అందువల్ల కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను యాభై శాతానికి పెంచాలని కోరినట్లు తెలిపారు. తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్నప్పటికీ, సంపద, ఆదాయ పంపిణీలో అంతరం ఉందని, ఇలాంటి అసమానతల కారణంగానే గతంలో రాష్ట్ర సాధన ఉద్యమాలను చవిచూసిందని ఆయన గుర్తుచేశారు. మంగళవారం ప్రజాభవన్ లో జరిగిన 16వ ఆర్థిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వ పథకాల వినియోగంలో కఠిన నిబంధనలు ఉంటున్నాయని, రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా వాటిని సద్వినియోగం చేసుకునేలా నిబంధనలను మార్చాలన్నారు. ప్రధానంగా తెలంగాణలో ఆదాయ అసమానతలు ఎక్కువని, చాలా తక్కువ మంది చేతుల్లోనే ఎక్కువ సంపద కేంద్రీకృతమై ఉందన్నారు. రాష్ట్రంలో ఆదాయం మెరుగ్గా ఉన్నా కొన్ని జిల్లాల్లో ఉపాధి, ఆదాయం తక్కువ ఉందని వివరించారు.

### రుణభారంతో సతమతం..

కొత్తగా ఏర్పడిన తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో వేగంగా అడుగులు వేస్తున్నప్పటికీ, గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.6.85 లక్షల కోట్లకు పైగా రుణ భారంతో సతమతమవుతున్నామని భట్టి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రుణాన్ని పునర్నిర్మించేందుకు అదనపు సహాయాన్ని అందించడంలో ఆర్థిక సంఘం మద్దతు అందించాలని విజ్ఞప్తి చేశామన్నారు. తలసరి ఆదాయం కారణంగా తెలంగాణ వంటి రాష్ట్రానికి వికేంద్రీకరణను తగ్గించే ఫార్ములాను అవలంబిస్తే, అసమానతల తగ్గింపునకు చర్యలు తీసుకోవడంలో అది రాష్ట్రాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందన్నారు. అందువల్ల సమాంతర విభజనను నిర్ణయించడంలో తలసరి ఆదాయాన్ని ప్రాథమిక సూచికగా ఉపయోగించడాన్ని పునఃపరిశీలించాలని కోరామన్నారు. కేవలం తలసరి ఆదాయంతో శ్రేయస్సును కొలవడం వల్ల రాష్ట్రంలో ఉన్న అసమానతలను పరిష్కరించడానికి అవకాశముంటుందన్నారు. చివరగా కొన్ని ఖర్చులు, తరచుగా ఉచితాలు అని తప్పుగా లేబుల్ చేయబడ్డాయన్నారు. రైతు భరోసా, వ్యవసాయ రుణాల మాఫీ, ఆహార సబ్సిడీలు వంటి కార్యక్రమాలు బలహీన వర్గాలకు ఆర్థిక స్థిరత్వం సామాజిక భద్రతను కలిగిస్తాయన్నారు.

### స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఉద్యోగాలు

నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించామని భట్టి పేర్కొన్నారు. టాటా కంపెనీ సహకారంతో 65 ఐటీఐ లను అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. అక్షరాస్యతను పెంచేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను రూ. 5వేల కోట్లతో ప్రారంభిస్తున్నామని భట్టి తెలిపారు. నాలుగో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో వాటిని ప్రారంభిస్తున్నామన్నారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆదర్శ కమిటీలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలను ఆదర్శ కమిటీ లో భాగస్వాములను చేశామన్నారు. గ్రామీణ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రతి ఏటా వడ్డీ లేని రుణాలు రూ. 20 వేల కోట్లు అందిస్తున్నామన్నారు.

# కరీంనగర్ టు హసన్ పర్తి..

- కొత్త రైల్వే లేన్ కు పర్మిషన్ ఇవ్వండి
- ఉప్పల్ రైల్వే స్టేషన్ ను అప్ గ్రేడ్ చేయండి
- జమ్మికుంటలో దక్షిణ్ ఎక్స్ ప్రెస్ ఆగేలా ఆదేశించాలి
- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ లేఖ

**జనపదం, ఢిల్లీ :** కరీంనగర్ – హసన్ పర్తి కొత్త రైల్వే లేన్ ప్రాజెక్టు పూర్తి నివేదిక (డీపీఆర్) సిద్ధమైనందున నిర్మాణ పనులకు అనుమతి ఇవ్వాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను కోరారు. ఢిల్లీలో అశ్వినీ వైష్ణవ్ ను కలిసిన బండి సంజయ్ ఈ మేరకు లేఖను అందజేశారు. కరీంనగర్ నుంచి హసన్ పర్తి వరకు 61.8 కి.మీల మేరకు నిర్మించే కొత్త రైల్వే లేన్ కు రూ.1415 కోట్లు వ్యయం అవుతుందని, ఈ మేరకు డీపీఆర్ కూడా సిద్ధమైందని తెలిపారు. రైల్వే బోర్డులో ఈ అంశం పెండింగ్ లో ఉందని, తక్షణమే ఆమోదం తెలపాలని కోరారు. కొత్త రైల్వే లేన్ నిర్మాణం పూర్తయితే తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, కరీంనగర్ – వరంగల్ మధ్య వాణిజ్య కనెక్టివిటీ పెరిగి ఆర్థిక వృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. దీంతోపాటు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్ రైల్వే స్టేషన్ ను అప్ గ్రేడ్ చేయాలని, జమ్మికుంట స్టేషన్ వద్ద దక్షిణ ఎక్స్ ప్రెస్ రైలు ఆగేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ఉప్పల్ స్టేషన్ అప్ గ్రేడ్ లో భాగంగా ప్లాట్ ఫాం, రైల్వే స్టేషన్ భవనాన్ని ఆధునీకరించాలని, కొత్త రైల్వే సేవలను ప్రవేశపెట్టాలని కోరారు. ప్రయాణికుల రాకపోకలకు సంబంధించిన సౌకర్యాలను మెరుగుపర్చాలని, పార్కింగ్ ను విస్తరించాలని, సోలార్ ప్యానెళ్లను అమర్చాలని, టిక్కెట్ కౌంటర్, లగేజీ నిర్వహణ వ్యవస్థను మెరుగుపర్చాలని ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రజలకు ఎంతో మేలు కలిగించే ఉప్పల్ రైల్వే స్టేషన్ ఆధునీకరణకు సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ పట్టణాభివృద్ధి భేష్




- రాష్ట్రానికి అదనపు రుణాల అంశాన్ని పరిశీలిస్తాం
- రాష్ట్రాలకు ప్రోత్సాహం ఇవ్వాలనే అంశంపై తర్వాత సిఫారసు చేస్తాం...
- సెస్, సర్ ఛార్జీల్లోనూ తెలంగాణ వాటా కోరింది
- 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగఢియా

**జనపదం, హైదరాబాద్ :** తెలంగాణలో పట్టణాభివృద్ధి భేష్ గా ఉందని 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగడియా ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగా అదనపు రుణాల అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. మంగళవారం ప్రజాభవన్ వేదికగా జరిగిన 16వ కేంద్ర ఆర్థిక సంఘం సమావేశంలో ఛైర్మన్ పనగఢియా పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెస్, సర్ ఛార్జీల్లోనూ వాటా ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోరిందన్నారు. ఆరో రాష్ట్రంగా తెలంగాణలో కమిషన్ పర్యటిస్తోందని, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు, అన్ని అంశాలను కమిషన్ కు ప్రభుత్వం వివరించిందని చెప్పారు. రుణాలు, రుణభారం గురించి రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందని పేర్కొన్నారు. ప్రధానంగా తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలు బాగున్నాయని ఆయన ప్రశంసించారు. ఎక్కడైనా పట్టణాభివృద్ధిని సాధారణంగా నిర్లక్ష్యం చేస్తారని కానీ, తెలంగాణ మాత్రం మంచి ప్రాధాన్యం ఇస్తోందని కితాబిచ్చారు. మంచి పనితీరు కనబర్చిన రాష్ట్రాలకు నష్టం జరుగుతోందని, ప్రోత్సాహకం ఇవ్వాలని తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు కోరాయని, వాటిని పరిశీలిస్తామని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం డివిజబుల్ పూల్‌లో 41 శాతం నిధులు సిఫారసు చేసిందని, ఆ మొత్తాన్ని రాష్ట్రాలకు ఇస్తున్నారని చెప్పా రు. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల్లో రాష్ట్రాల, ఆయా రంగాలకు ప్రత్యేకంగా సిఫారసు చేసిన గ్రాంట్లు మాత్రమే రాలేదని, అది కేంద్ర ప్రభుత్వ నిర్ణయమని ఛైర్మన్ తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో పర్యటించి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత తగిన సిఫారసులు చేస్తామని అరవింద్ పనగఢియా స్పష్టం చేశారు.



# జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే సతీమణి కన్నుమూత

### లక్ష్మారెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు పరామర్శ



**జనపదం, నాగర్ కర్నూల్ :** బీఆర్ఎస్ నేత, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతా లక్ష్మారెడ్డి(58) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె చెన్నైలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామానికి చేరుకొని శ్వేతా లక్ష్మా రెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. లక్ష్మారెడ్డి కి ధైర్యం చెప్పి ఓదార్చారు. అలాగే శ్వేతారెడ్డికి నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సురేందర్, జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, రాజేందర్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ ఛైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, రజిని, ఇంతియాజ్, ఇతర నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

# హైడ్రా పేరుతో హడావుడి ..

- నిరు పేదలకు ఇబ్బందులు పెట్టొద్దు
- ఫాతిమా కాలేజీకి ఒక న్యాయం.. పేదలకు మరో న్యాయమా..?
- ఆక్రమణలపై కమిషనర్ కు ఫిర్యాదు చేస్తాం
- బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**జనపదం, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో హడావుడి చేస్తున్నదని, ప్రస్తుతం జరుగుతున్న తంతు చూస్తుంటే అనేక అనుమానాలు కలుగుతున్నాయని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు . మంగళవారం బీజేపీ స్టేట్ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం పేదలు, మధ్యతరగతి కుటుంబాలను ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తోందని, హైడ్రాకు, రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నాలాలు, చెరువులను కబ్జాల చెర నుంచి విడిపించడానికి ప్రయత్నం చేయాలన్నారు. 2022లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద చెరువుల సుందరీకరణ పేరుతో హైదరాబాద్ లో 25 చెరువులను బడా కంపెనీలకు ధారదత్తం చేసిందని ఆరోపించారు. నానక్ రామ్ గూడలో మీనాక్షి ఇన్ ఫ్రా స్ట్రక్చర్ వద్ద చెరువుల్లో మధ్య నుంచి రోడ్డు నిర్మించి, బహుళ అంతస్తుల కట్టడాలు నిర్మించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారన్నారు. వంశీరామ్ బిల్డర్స్ పేరుతో అనేక నిర్మాణాలు చేపట్టారు. సల్కం చెరువులో అక్రగా ఎంఐఎం కి సంబంధించిన ఫాతిమా కాలేజీ నిర్మాణం చేపడితే ఎందుకు కూల్చడం లేదని ప్రశ్నించారు. అలాంటిది కేవలం పేదలను, మధ్యతరగతి కుటుంబాలను ఇబ్బంది పెట్టాలనుకోవడం సబబు కాదన్నారు. ఎంఐఎం పార్టీకి చెందిన ఫాతిమా కాలేజీకి ఒక న్యాయం.. పేదలకు మరో న్యాయమా..? అని ప్రశ్నించారు. హైడ్రాపై ఎంఐఎం పార్టీ ఒత్తిడి తీవ్రమైనట్లు అనుమానం ఉందని, హైడ్రా కమిషనర్ తో పాటు సంబంధిత అధికారులను కూడా మార్చే ప్రయత్నంలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఇరిగేషన్ అధికారులకు సంబంధం లేకుండా చెరువులకు ఎఫ్‌టీఎల్ పరిధిని ఫిక్స్ చేసి వివిధ కంపెనీలకు అనుమతులు ఎలా జారీ చేస్తారన్నారు. అక్రమంగా ఆక్రమణలకు పాల్పడి, చెరువులను కబ్జా చేసి వేల కోట్ల రూపాయలు వ్యాపారాలు చేస్తున్న బడా కంపెనీలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, అందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అభ్యంతరం ఎందుకన్నారు. గరంలోని 25 చెరువులే కాకుండా నిజాం నుంచి ఇప్పటివరకు ఆక్రమణకు గురైన భూముల వివరాలకు సంబంధించి చాలా రికార్డులు మాయమయ్యాయని, ఈ విషయమై హైడ్రా కమిషనర్ ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. న్యాయం చేయకపోతే హైకోర్టును ఆశ్రయిస్తాయని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గత ప్రభుత్వంలో జరిగిన చెరువుల ఆక్రమణల గోల్ మాల్ వ్యవహారంపై సమీక్ష జరిపి చర్యలు తీసుకోవాలని పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు.

# పారాలింపిక్స్ విజేతలకు భారీగా నజరానా

**ఎవరికి ఎంత ఇస్తారో తెలుసా..?**



**జనపదం, స్పోర్ట్స్:** పారిస్ లో జరిగిన పారాలింపిక్స్‌లో మన అథ్లెట్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఈ సారి మొత్తం 84 మంది అథ్లెట్లు పోటీపడగా, దేశానికి 29 పతకాలు లభించాయి. ఇందులో 7 స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్యాలు ఉన్నాయి. పారాలింపిక్స్ చరిత్రలో భారత్ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చింది. పతకాల పట్టికలో 18వ స్థానంలో నిలిచింది. పతకాలు కొల్లగొట్టిన విజేతలు ఆర్థిక ప్రోత్సాహకాలు అందుకోనున్నారు. మంగళవారం న్యూ ఢిల్లీలో జరిగిన వేడుకల్లో పారాలింపిక్ విజేతలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులకు క్రీడా మంత్రి మన్‌సుఖ్ మాండవియా నగదు పురస్కారాలను ప్రకటించారు.

**బంగారు పతక విజేతలకు రూ.75 లక్షలు**

పారాలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులకు రూ.75 లక్షలు అందుకుంటారు. రజత పతక విజేతలకు రూ.50 లక్షలు, కాంస్య పతక విజేతలకు రూ.30 లక్షలు నగదు బహుమతి అందజేస్తామని క్రీడా మంత్రి ప్రకటించారు. అదే సమయంలో, ఆర్చర్ శీతల్ దేవి వంటి మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో పతకాలు సాధించిన వారికి రూ.22.5 లక్షల నగదు బహుమతి అందజేస్తారు.

**పారా అథ్లెట్లకు మరిన్ని సౌకర్యాలు**

2028 లాస్ ఏంజెల్స్ పారాలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధించేందుకు పారా అథ్లెట్లకు పూర్తి మద్దతు, సౌకర్యా లు కల్పిస్తామని మాండవ్య హామీ ఇచ్చారు. పారాలింపిక్స్, పారా స్పోర్ట్స్ లో భారత్ రాణిస్తోందని తెలిపారు. 2016లో 4 పతకాలు సాధించగా, 2020 టోక్యోలో 19 పతకాలు, పారిస్ లో 29 పతకాలతో అద్భుత పురోగతి కనబరిచింది. ఈ నేపథ్యంలోనే బంగా రు పతకాలు సాధించేందుకు వీలుగా పారా అథ్లెట్లు అందరికీ అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మాండవ్య తెలిపారు.

### చరిత్ర సృష్టించిన భారత్

ఈ పారాలింపిక్స్‌తో భారత్ మొత్తం 50 పతకాల మార్కును అందుకుంది. పారాలింపిక్స్‌లో భారత దేశానికి మొదటి పతకం 1972లో లభించింది. అప్పుడు మురళీకాంత్ పెట్కర్ స్విమ్మింగ్‌లో బంగారు పతకం సాధించాడు. 2024 క్రీడలకు ముందు భారత్ 12 పారాలింపిక్స్‌లో మొత్తం 31 పతకాలు సాధించింది. పారిస్ క్రీడలతో హాఫ్ సెంచరీ అందుకుంది. ఈ సారి భారతదేశం ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్‌ల నుంచి ఏకంగా 17 పతకాలు కొల్లగొట్టింది. స్విట్జర్లాండ్, దక్షిణ కొరియా, బెల్జియం, అర్జెంటీనా వంటి దేశాలను వెనక్కినెట్టి టాప్ 20లో చేరింది. 200 పతకాలతో మరోసారి చైనా టాప్ ప్లేస్ సొంతం చేసుకుంది.



# ఇద్దరు హీరోయిన్లతో గిల్



**టీజనపదం, స్పోర్ట్స్:** మ్ ఇండియా స్టార్ బ్యాట్స్‌మెన్ శుభ్‌మాన్ గిల్ మళ్లీ వార్తల్లో నిలిచాడు. ఈసారి మాత్రం సారా టెండూల్కర్‌తో డేటింగ్ చేస్తున్నారనే విషయం కాదు. గిల్ మరో నటితో డేటింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నటి ఇటీవల గిల్ పుట్టినరోజున శుభాకాంక్షలు తెలిపింది. అంతేకాదు వారిద్దరూ కలిసి ఉన్న చిత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సెప్టెంబర్ 8న శుభ్‌మన్ గిల్ పుట్టినరోజు. ఆ క్రమంలో నటి అవనీత్ కౌర్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఒక చిత్రాన్ని పంచుకున్నారు. అందులో ఇద్దరూ కలిసి కనిపించారు. అవనీత్ ఆ చిత్రానికి క్యాప్షన్ కూడా ఇచ్చారు. పుట్టినరోజు శుభాకాంక్షలు, శుభమాన్. మీరు అనేక మంది వ్యక్తులకు స్ఫూర్తినిస్తూ ఉంటారని, మీ గురించి గర్వపడుతున్నట్లు వెల్లడించారు. దీంతో శుభ్‌మన్ గిల్, అవనీత్ కౌర్ రిలేషన్ షిప్‌లో ఉన్నారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అంతకుముందు 2023 సంవత్సరంలో వీరిద్దరూ కలిసి లండన్‌లో తిరుగుతూ కనిపించారు. ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

**మరో నటితో**

సోషల్ మీడియా పోస్టులో శుభమాన్ గిల్, బాలీవుడ్ నటి అనన్య పాండేతో కలిసి ఉన్న ఫొటో కూడా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ క్రమంలో గిల్ అనన్యతోకూడా డేటింగ్ చేస్తున్నారని పుకార్లు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం వీరిద్దరి చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇప్పటి వరకు గిల్ నుంచి మాత్రం డేటింగ్ గురించి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. సోషల్ మీడియాలో మాత్రమే పెద్ద ఎత్తున వీరి చిత్రాలతో పుకార్లు వినిపిస్తున్నాయి.



# పంత్ ప్లేస్ లో రింకూ..

## రెండు రోజుల్లో దులీప్ ట్రోఫీ

**జనపదం, స్పోర్ట్స్:** దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ రెండు రోజుల్లో మొదలుకానుంది. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టుకు ఎంపికైన వాళ్లు విశ్రాంతి తీసుకోనున్నారు. దీంతో దులీప్ ట్రోఫీ నుంచి ఓపెనర్ యశస్వీ జైస్వాల్, వికెట్ కీపర్ రిషబ్ పంత్‌లతో పాటు పలువురు ఆటగాళ్లకు బీసీసీఐ బ్రేక్ ఇచ్చింది. మంగళవారం బీసీసీఐ దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ కోసం స్క్వాడ్‌ను ప్రకటించింది. ఇండియా బీ తరఫున ఫినిషర్ రింకూ సింగ్ ఆడనున్నాడు. ఓపెనర్ మయంక్ అగర్వాల్ ఇండియా ఏ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. సెప్టెంబర్ 12 నుంచి దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ జరుగనుంది. ఈసారి ఇండియా బీ తరఫున పంత్ బదులు రింకూ బరిలోకి దిగనున్నాడు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ స్థానలో సుయాశ్ ప్రభుదేశాయ్ ఆడనున్నాడు. ఇండియా ఏ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ నుంచి మయాంక్ అగర్వాల్ పగ్గాలు అందుకోనున్నాడు. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు స్క్వాడ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్, కుల్దీప్ యాదవ్, అకాశ్ దీప్, అక్షర్ పటేల్‌లు సైతం దులీప్ ట్రోఫీ రెండో రౌండ్‌లో ఆడడం లేదు. తొలి రౌండ్‌లో ఇండియా ఏపై ఇండియా బీ, ఇండియా డీపై ఇండియా సీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.



# యూఎస్ టీ10 లీగ్ లో రైనా..

**జనపదం, స్పోర్ట్స్:** భారత మాజీ ఆల్‌రౌండర్ సురేశ్ రైనా మళ్లీ బ్యాటుతో బాదేందుకు సిద్ధమవుతున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు తర్వాత ఫ్రాంచైజ్ క్రికెట్‌లో మెరుస్తున్న రైనా.. ఇక యూఎస్ టీ10 లీగ్ లో తన మార్క్ ఆటతో చెలరేగనున్నాడు. కొత్త ఫ్రాంచైజీ చికాగో ప్లేయర్స్ తరఫున ఆడేందుకు రెడీ అయ్యాడు. ఈ విషయాన్ని రైనా సోషల్ మీడియా వేదికగా మంగళవారం అందరితో పంచుకున్నాడు. 'యూఎస్ మాస్టర్స్ టీ10 లీగ్‌లో భాగం అవుతున్నందుకు చాలా థ్రిల్‌గా ఉంది. ఈమధ్య కాలంలో బాగా పాపులర్ అవుతున్న టీ10 లీగ్‌లో ఆడడాన్ని ఎంజాయ్ చేయబోతున్నా. అమెరికాలోని క్రికెట్ అభిమానుల ముందు ఆడేందుకు ఎంతో ఆతృతగా ఉన్నాను' అని రైనా ఎక్స్ పోస్ట్‌లో తెలిపాడు. యూఎస్ మాస్టర్స్ టీ10 లీగ్ ఈ ఏడాది నవంబర్ 8వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ జరుగనుంది. ఈ లీగ్‌లో రైనాతో పాటు భారత మాజీ క్రికెటర్ పార్థీవ్ పటేల్, పవన్ నేగీలు కూడా చికాగో ప్లేయర్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు.



# మ్యాచ్ ఫిక్సింగ్.. 43 మందిపై జీవిత కాల నిషేధం..

**జనపదం, స్పోర్ట్స్:** ఫుట్‌బాల్‌లో 'మ్యాచ్ ఫిక్సింగ్' కు పాల్పడిన 43 మంది జీవిత కాల నిషేధానికి గురయ్యారు. ఇంతకు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నది ఎవరంటే.. చైనా ఫుట్‌బాల్ సమాఖ్య. నిషేధానికి గురైన వారిలో అంతర్జాతీయ ఆటగాళ్లు కూడా ఉండడం గమనార్హం. చైనా ఫుట్‌బాల్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలను ఆ దేశ ఫుట్‌బాల్ సమాఖ్య సీరియస్‌గా తీసుకుంది. ఊరికే చర్యలు తీసుకోవడంలో అర్థం ఉండదని.. మ్యాచ్ ఫిక్సింగ్‌పై విచారణ చేపట్టింది. చివరకు 120 మ్యాచుల్లో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగినట్టు చైనా సమాఖ్య దృష్టికి వచ్చింది. 38 మంది ఆటగాళ్లతో పాటు నలుగురు ఫుట్‌బాల్ అధికారులకు ఆ పాపంలో భాగం ఉందని తేలింది. దీంతో ఏమాత్రం ఆలస్యం చేయకుండా 41 మందిపై జీవిత కాల నిషేధం విధించింది. మ్యాచ్ ఫిక్సింగ్ కారణంగా సస్పెన్షన్‌కు గురైన వారిలో చైనాకు చెందిన అంతర్జాతీయ ఆటగాళ్లు జిన్ జింగ్‌డావో, గువో టియన్యు, గు చావోలతో పాటు దక్షిణ కొరియా ప్లేయర్ సన్ జున్ హో కూడా ఉన్నాడు.



# సికిందర్‌తో కాజల్..

బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ప్రాజెక్ట్ 'సికందర్'. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2025 ఈద్ కానుకగా ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. సికిందర్‌లో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందని తెలిసిందే. తాజాగా ఈ మూవీలో మరో భామ కూడా చేరిపోయింది. టాలీవుడ్ కలువ కండ్ల సుందరి కాజల్ అగర్వాల్ మరో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్నట్టు వచ్చిన వార్తలు నిజమయ్యాయి. సికిందర్ టీంలోకి కాజల్‌కు స్వాగతం పలుకుతూ.. సెట్స్‌లో జాయిన్ అయిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలియజేశారు. మరి మురుగదాస్ ఈ ఇద్దరు భామలను ఎలాంటి పాత్రల్లో చూపించబో తున్నాడన్నది సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.





# పూనకాలు పుట్టిస్తున్న ట్రైలర్

## మూవీ రిలీజ్ కు ముందే రికార్డ్స్

గ్లోబర్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ రెండు పార్టులుగా రాబోతుండగా.. దేవర పార్టు-1 సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో సందడి చేయనుంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది మూవీ టీం. తాజాగా మంగళవారం సాయంత్రం ట్రైలర్ రిలీజ్ చేసింది. స్టన్నింగ్‌గా సాగుతున్న ట్రైలర్ అభిమానులకు కావాల్సిన ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించనున్నట్టు చెప్పకనే చెబుతోంది. దేవరలో బాలీవుడ్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర రోల్‌లో నటిస్తుండగా.. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్, మలయాళ యాక్టర్ షైన్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ, హిమజ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్ విడుదలకు ముందే అనార్త్ అమెరికా బాక్సాఫీస్ వద్ద ప్రీ సేల్స్‌లో రూ.8.2 కోట్ల మార్క్‌ను అధిగమించి అరుదైన ఫీట్ నమోదు చేసిన విషయం తెలిసిందే. ట్రైలర్ విడుదలకు ముందే వేగంగా 1 మిలియన్ డాలర్ క్లబ్‌లోకి చేరిన తొలి ఇండియా సినిమాగా అరుదైన రికార్డు నమోదు చేసింది.

# రాజాసాబ్ షూటింగ్ షురూ..

గ్లోబల్ స్టార్ హీరో ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం రాజాసాబ్. మారుతి డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోంది. ఈ చిత్రంలో మలయాళ భామ మాళవికా మోహనన్, ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. చాలా రోజుల తర్వాత ఈ సినిమాకు సంబంధించిన కొత్త అప్‌డేట్ తెరపైకి వచ్చింది. రాజాసాబ్ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో కొనసాగుతున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. ప్రభాస్ అండ్ హీరోయిన్లపై ఫన్ రైడ్‌గా సాగే సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్టు ఇన్‌సైడ్ టాక్. ఈ చిత్రంలో ప్రభాస్ లవర్ బాయ్‌గా కనిపించనుండగా.. మారుతి ఈ సినిమాతో పాన్ ఇండియా మార్కెట్‌లోకి ఎంట్రీ ఇచ్చి తన రేంజ్ చాటాలని చూస్తున్నాడు. ఇప్పటికే లాంచ్ చేసిన రాజాసాబ్ గ్లింప్స్ లో ప్రభాస్ సూపర్ స్టైలిష్‌గా చేతిలో పూలబొకే పట్టుకొని అద్దంలో తనను తాను చూసుకుంటూ.. పూలు చల్లుతున్న విజువల్స్ నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. ఈ మూవీలో బాలీవుడ్ స్టార్ యాక్టర్ సంజయ్ దత్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ చిత్రం 2025 ఏప్రిల్ 10న విడుదల కానుంది.



# గాంధారి

**రీసెంట్‌గా ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబా** సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది తాప్సీ పన్ను. నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్ హసీన్ దిల్ రుబకు సీక్వెల్‌గా వచ్చిన ఈ మూవీ ఫస్ట్ పార్టు ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోలేకపోయింది. ఈ భామ తాజాగా మరో నెట్‌ఫ్లిక్స్ ప్రాజెక్ట్ అప్‌డేట్‌తో ప్రేక్షకుల ముందుకొచ్చింది. రైటర్ కనిక ధిల్లాన్‌తో కలిసి సినిమా చేస్తుండగా.. ఈ ప్రాజెక్టుకు గాంధారి టైటిల్‌ను ఫైనల్ చేశారు. యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ చిత్రాన్ని అనౌన్స్‌మెంట్ టీజర్‌తో ప్రకటించారు. దేవాశిష్ మఖిజా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని హోంబ్యానర్ Kathha Picturesపై కనికా ధిల్లాన్ నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలపై త్వరలోనే క్లారిటీ రానుంది.





# రాజ్ తరుణ్ చోరీ చేశాడు..

## యాక్టర్ రాజ్‌తరుణ్ - లావణ్య కేసులో మరో ట్విస్ట్

**టాలీవుడ్ యాక్టర్ రాజ్‌తరుణ్ -లావణ్య** కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ కేసుకు సంబంధించిన లావణ్య సమర్పించిన ఆధారాలతో.. ఇంటి వద్ద సాక్ష్యాలు సేకరించిన పోలీసులు రాజ్‌తరుణ్‌పై ఛార్జ్‌షీట్ దాఖలు చేసి నిందితుడిగా చేర్చారు. మరోవైపు ఈ కేసులో రాజ్‌తరుణ్ ముందస్తు బెయిల్ కూడా తీసుకున్నాడు. కేసులో కొత్త ట్విస్ట్ నెలకొంది. రాజ్‌తరుణ్, మాల్వీ మల్హోత్రాపై పీఎస్‌లో లావణ్య నార్సింగి పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. తన ఇంట్లో రూ.12 లక్షల విలువైన బంగారం చోరీ జరిగిందని.. బంగారం, పుస్తెలతాడు, తాళిబొట్టు రాజ్ తరుణ్ దొంగిలించాడని లావణ్య ఆరోపించింది. పెళ్లికి సంబంధించిన ఆధారాలు మాయం చేసేందుకు రాజ్ తరుణ్ ప్రయత్నించాడని ఆరోపించిన లావణ్య తాళితో పాటు డాక్యుమెంట్లు కూడా తీసుకెళ్లాడని ఫిర్యాదులో పేర్కొంది. బంగారం కొనుగోలు చేసిన జ్యువెలరీ షాప్ బిల్స్‌తో సహా పీఎస్‌కు వచ్చిన లావణ్య.. తన నగలు బీరువాలో దాచానని, ఆ బీరువా తాళపు చెవి రాజ్ తరుణ్ దగ్గరే ఉన్నాయని, తనకు తెలియకుండా వాటిని దొంగిలించాడనేందుకు తన దగ్గర ఆధారాలున్నాయని లావణ్య చెప్పుకొచ్చింది.

Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082. Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act ) Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com